

సినీతార సందడి..

మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో గురువారం సినీ నటి ప్రియాంక మోహన్ సందడి చేశారు. 'కాసం ఫ్యాషన్' మాల్ 13వ స్టోర్‌ను ప్రారంభించారు..

వివరాలు 6లో..

కార్మికుల సమ్మె

కేసముద్రం, న్యూస్‌టుడే: కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కార్మికులు గురువారం మెరుపు సమ్మెకు దిగడంతో ఖరీదులు నిలిచిపోయాయి. మూడేళ్లు గడిచినా కూలీ రేట్లు పెంచకపోవడంపై నిరసన వ్యక్తం చేశారు. రెండేళ్లకు ఒకసారి కార్మికులకు కూలీ రేట్లు పెంచాల్సి ఉంటుంది. ఇటీవల హమాలీ, దడువాయి కార్మికుల కూలీ రేట్లు 20 శాతం పెంచారు. సరకులు నింపే సమయంలో కూలీలే బస్తా పట్టుకోవాలని రైతు నాయకుల డిమాండ్‌తో కూలీ రేట్లు ప్రకటన నిలిచిపోయింది. మార్కెట్‌కు గురువారం రేట్లు ప్రకటించే వరకు పనులకు హాజరుకామంటూ గురువారం కూలీలు మెరుపు సమ్మెకు దిగారు. గురువారం 4058 బస్తాల వ్యవసాయోత్పత్తులు విక్రయానికి వచ్చాయి. దీంతో రెండు గంటల పాటు ఖరీదులు నిలిచిపోయాయి. మార్కెట్ కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావు వెంటనే కార్మిక నాయకులతో మాట్లాడి సర్ది చెప్పడంతో పనులకు హాజరయ్యారు.

పైసలు లేవు.. పండగ ఏర్పాట్లు ఎలా?

- గ్రామాలకు అందని కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నిధులు

ఈనాడు, వరంగల్

బతుకమ్మ, దసరా రాష్ట్రంలో పెద్ద పండగలు. ప్రజలంతా ఒక్కచోట చేరి చేసుకునే వేడుకలు. ఈసారి పల్లెల్లో పండగ ఏర్పాట్లు ఎలా చేయాలని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతిలో చిల్లిగవ్వ లేదని వాపోతున్నారు.



ఇదీ పరిస్థితి..

హనుమకొండ జిల్లా దామెర మండలం పంచాయతీ కార్యదర్శులు గత నెల 20న మండల పరిషత్తు అభివృద్ధి అధికారికి తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం ఇస్తున్నారు. గ్రామాల్లో తీవ్ర నిధుల కొరత ఉందని, బతుకమ్మ, దసరా పండగల ఏర్పాట్లు మోయలేని భారంగా మారాయని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్‌వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఈ పరిస్థితే నెలకొంది.



ఇది వరంగల్ జిల్లా గీసుకొండ మండల కేంద్రంలోని చెరువు. సద్దుల బతుకమ్మ వేడుకలను ఇక్కడే నిర్వహిస్తారు. మరో రెండు మూడు రోజుల్లో చెరువు కట్ట మీద పిచ్చి మొక్కలు తొలగించాల్సి ఉంది.

- ఈ ఆర్థిక సంక్షోభం సమయంలో ఈసారి బతుకమ్మ, దసరా పండగలకు చెరువు కట్టల వద్ద విద్యుత్తు దీపాల ఏర్పాటు, కట్టలపై జంగిల్ కట్టింగ్, డీజే సౌండ్ ఏర్పాటు లాంటివి ఏర్పాటుచేసేందుకు తమ వద్ద డబ్బులు లేవని కార్యదర్శులు ఉన్నతాధికారులకు వినతులు ఇస్తూ నిధుల కోసం వేడుకుంటున్నారు. ఉమ్మడి వరంగల్‌లో వందలాది గ్రామాల్లో ఏర్పాట్లు ఎలా చేసేది అంటూ కార్యదర్శులు దిగులు చెందుతున్నారు.

ఫిబ్రవరిలో సర్పంచుల పదవీ కాలం పూర్తయిన తర్వాత కేంద్రం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. రాష్ట్రం నెలనెలా అందివ్వాల్సిన ఆర్థిక సంఘం డబ్బులు ఎన్నో నెలల తరబడి గ్రామాలకు అందడం లేదు. దీంతో ఇప్పటికే మోటార్ల మరమ్మతు, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు, వీధి దీపాల మరమ్మతుల కోసం తాము అప్పులు చేసి గ్రామ పాలన నడిపిస్తున్నామని కార్యదర్శులు చెబుతున్నారు.

- ములుగు 2022-23 సంవత్సరానికి సంబంధించి రూ.5.59 కోట్ల బకాయిలు గ్రామాలకు రావాల్సి ఉంది. ఈసారి బకాయిలు మూడు రెట్లకన్నా ఎక్కువగా పేరుకుపోవడంతో అనేక ఏజెన్సీ గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది.



ఇది వరంగల్ జిల్లా గీసుకొండ మండలం శాయంపేట హవేలీ గ్రామం. బతుకమ్మ ఆడే ప్రాంతాల్లో డోజర్లు లేదా ట్రాక్టర్లతో మొక్కలను తొలగించాల్సి ఉండగా నిధులు లేకపోవడంతో పంచాయతీలోని మల్టీ పర్పస్ కార్మికులే చేతితో మొక్కలు పీకేస్తున్నారు. ఇలా అనేక పంచాయతీలకు అందాల్సిన నిధులు రాక పలు రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అన్నింటికీ ఉద్దరే..

మేజర్ పంచాయతీలకు అంగడి ద్వారా ఆదాయం రావడంతో వారు వివిధ రకాల ఖర్చులకు సర్దుబాటు చేస్తున్నారు. చిన్న పంచాయతీలకు ఆదాయ వనరులు లేకపోవడంతో కార్యదర్శులు అప్పులు చేసి మరీ అవసరాలు తీరుస్తున్నారు. ఆర్థిక స్తోమత లేని వారు దుకాణాల్లో ఉద్దెర తెస్తున్నారు. గ్రామ సభలు ఏర్పాటుచేసినప్పుడు టెంట్ హౌజ్‌లు, ఎలక్ట్రిక్ బల్బులతోపాటు చిన్న చిన్న వస్తువులన్నీ సగం చెల్లించి మిగతాది ఉద్దెరగా తెస్తున్నామని చెబుతున్నారు. ప్రస్తుతం డెంగీ, విష జ్వరాలు విజృంభిస్తున్న క్రమంలో బ్లీచింగ్ పొడి కొనేందుకు, దోమల నివారణకు ఆయిల్‌బాల్స్ వేసేందుకు డబ్బులు లేవని ఇప్పుడు పైసలు లేకుండా పండగలు చేయడం తలకు మించిన భారం అవుతుందని కాబట్టి మరిన్ని నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

ప్రత్యేక నిధి తక్కువే

రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీలకు నిధులు రాకపోవడంతో ప్రభుత్వం ఇప్పుడు తాత్కాలికంగా రాష్ట్రవ్యాప్తంగా రూ.162 కోట్లను జీవో ద్వారా విడుదల చేసినట్టు అధికారులు చెబుతున్నారు. ఒక్కో గ్రామంలో ఏర్పాట్లకు కనీసం రూ.25 వేల నుంచి రూ.50 వేలు అంతకన్నా ఎక్కువే వెచ్చించాలి. ఈ నిధులు పంచితే దేనికీ సరిపోవని కార్యదర్శులు వాపోతున్నారు.

జిల్లాల వారీగా పంచాయతీలకు రావాల్సిన బకాయిలు

జిల్లా	గత ఆరు నెలలుగా రావాల్సిన బకాయిలు (రూ.కోట్లలో)	పంచాయతీలు
ములుగు	18.85	208
హనుమకొండ	24.40	208
వరంగల్	27.95	325
జనగామ	24.76	283
మహబూబాబాద్	16.21	461
భూపాలపల్లి	18.22	240

సుందరీకరణపై ప్రత్యేక దృష్టి

రూ. 3 కోట్లతో కంబాలచెరువు అభివృద్ధికి ప్రతిపాదనలు

మహబూబాబాద్, న్యూస్‌టుడే: మహబూబాబాద్ పట్టణంలోని కంబాలచెరువు సుందరంగా రూపుదిద్దుకొని ఇక అందాలకు నెలవు కానుంది. మహబూబాబాద్-మరిపెడ ప్రధాన జాతీయ రహదారి పక్కనే కలెక్టరేట్‌కు సమీపంలో సుమారు కిలోమీటరు పొడవు ఉన్న ఈ చెరువు కట్టను మినీ ట్యాంక్‌బండ్‌గా సుందరీకరించేందుకు సుమారు రూ. 3 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు చేస్తున్నారు. ప్రత్యేక నిధులతో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచనల మేరకు పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఈ చెరువును పచ్చదనంతో ఆహ్లాదకరమైన వాతావరణంతో అక్కడికి వెళ్లినవారికి సేద తీర్చేలా తీర్చిదిద్దనున్నారు. జాతీయ రహదారి నుంచి రజాలిపేట వెళ్లే రహదారిలో మత్తడి వరకు సుమారు 800 మీటర్లు కట్ట పొడవునా చెరువును ఆధునికీకరించేందుకు నమూనాల రూపకల్పనకు అధికారులు అంచనాలు వేస్తున్నారు.



పట్టణంలోని కంబాలచెరువు కట్ట

పనులు ఇలా..

చెరువు కట్టకు మధ్యలో డివైడర్ ఇరువైపుల వాకింగ్ ట్రాక్ ఏర్పాటు, పచ్చ గడ్డి పరిచి అందమైన పూలమొక్కలు, మంచి గాలిని వీచే మొక్కలు నాటుతారు. మధ్యలో కూర్చునేందుకు వీలుగా బెంచీలు ఏర్పాటు చేస్తారు. వాటి మధ్య విద్యుత్తు దీపాలు, సమీపంలో గార్డెన్, పిల్లల ఆట పరికరాలు, ఓపెన్ జిమ్ పరికరాలు నెలకొల్పనున్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణం చేపట్టనున్నారు. చెరువు కట్ట ప్రారంభంలో ఆకర్షించే విధంగా స్వాగత తోరణ నిర్మాణం చేపట్టేందుకు ఆకర్షణీయమైన నమూనాలు రూపొందించనున్నారు. చెరువులో బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నారు. ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఈ తటాకాన్ని మినీ ట్యాంక్ బండ్‌గా మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని సాంకేతిక అనుమతులు రాగానే పనులు ప్రారంభించనున్నట్లు డీఈ ఉపేందర్ తెలిపారు.

కొనసాగిన ధ్రువపత్రాల పరిశీలన

మానుకోట, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024 నియామకాలకు సంబంధించి 1:3 నిష్పత్తిలో అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన రెండో రోజు గురువారం జిల్లా కేంద్రంలోని ఫాతిమా హైస్కూల్‌లో 20 బృందాలతో సాయంత్రం వరకు కొనసాగింది. రెండు రోజులుగా అన్ని విభాగాల పోస్టులకు సంబంధించిన 571 మంది అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన జరిగింది. మరో 389 మంది అభ్యర్థుల ధ్రువ పత్రాలున్నారు. ఈ నెల 5 వరకు పరిశీలన కొనసాగనుంది. జిల్లా విద్యాశాఖాధికారి వి.రాజేశ్వర్ ప్రక్రియను పర్యవేక్షించారు.



ధ్రువపత్రాల పరిశీలనను పర్యవేక్షిస్తున్న డీఈఓ రాజేశ్వర్

రుణమాఫీ అయ్యే వరకు పోరాడుతాం..

తొర్రూరు, న్యూస్‌టుడే: అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయకుంటే ప్రభుత్వంపై పోరాటం తప్పదని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం తొర్రూరులోని భారాస కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎర్రబెల్లి మాట్లాడారు. వంద రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేస్తామని హామీనిచ్చి ప్రజలను ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. రైతుభరోసా కింద ఎకరాకు రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు ఎక్కడని ప్రశ్నించారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా శుక్రవారం తొర్రూరులో రైతుధర్నా నిర్వహిస్తున్నామని, నిరసనకు మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరవుతారన్నారు. ధర్నాకు అన్నదాతలు, భారాస కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. పార్టీ మండలాధ్యక్షుడు సీతారాములు, నాయకులు డాక్టర్ సోమేశ్వరరావు, అంజయ్య, శ్రీనివాస్, ప్రదీప్‌రెడ్డి, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీమంత్రి దయాకర్‌రావు



పూజకు వేళాయే..

కేసముద్రం మండలం అర్పణపల్లి గ్రామంలో అమ్మవారి విగ్రహం వద్ద భక్తుల పూజలు

- మరిన్ని చిత్రాలు 7లో

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

గార్ల, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమని, సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపడుతున్న సంక్షేమ ఫలాలు ఆదర్శనీయమని మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్ తెలిపారు. మండలంలోని తిర్లాపురంలో గురువారం గ్వార్‌బాయ్ మాత్రో ఆత్మీయ సమ్మేళనం వ్యవస్థాపక అధ్యక్షుడు లచ్చీరాం అధ్యక్షతన జరిగింది. అర్హులందరికీ రెండు పడుకల ఇళ్లు, గార్లలో శాతవాహన సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదల, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరీ, మహబూబాబాద్ టీఎస్ఆర్టీసీ డిపో ద్వారా మహబూబాబాద్ నుంచి గార్ల నుంచి ఖమ్మం బస్సుల పునరుద్ధరణ చేపట్టనున్నట్లు ఎంపీ వెల్లడించారు. సమావేశం అనంతరం ఎంపీని గ్వార్‌బాయ్ మాత్రో బాధ్యులు ఎంపీని సత్కరించారు. మండల కార్యనిర్వాహక అధ్యక్షుడు కృష్ణగౌడ్, మండల నాయకులు మాజీ ఎంపీపీ వెంకట్‌లాల్, రావూరి వెంకటరామయ్య, వెంకటరెడ్డి, జలీల్, సత్యనారాయణరెడ్డి, పృథ్వీ, శంషాద్‌బేగం తదితరులున్నారు.



ప్రసంగిస్తున్న ఎంపీ బలరాంనాయక్

పొలాల మీదుగా.. చెరువు నీరు



డోర్నకల్ మండలం పెరుమాండ్లసంకీసలో రాత్రి కురిసిన భారీ వర్షానికి పెద్ద చెరువు గురువారం అలుగు పోసింది. పంట పొలాల మీదుగా పరుగులు తీస్తున్న నీటిని చూసి అన్నదాతలు ఒకింత కలవరం చెందుతున్నారు. సరిగ్గా నెల కిందట ఇలాంటి పరిస్థితే ఎదురైంది. అప్పుడు వ్యవసాయం ప్రారంభం దశలో ఉంది. అధిక వ్యయ ప్రయాసమైనా మెలకువలు పాటించి పంటను దక్కించుకున్నారు. ప్రస్తుతం నాట్లు పడి పొలాలు ఏపుగా పెరిగిన వేళ మళ్లీ నీట మునడంతో దీని ప్రభావం దిగుబడిపై పడుతుందనే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది.

– న్యూస్‌టుడే, డోర్నకల్

అవసరాల మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, జిల్లా ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్

మహబూబాబాద్, న్యూస్‌టుడే: ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోళ్ల కోసం జిల్లాల్లో అవసరాల మేరకు కొత్తగా మరికొన్ని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ సచివాలయం నుంచి ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు, మౌలిక వసతులు, రవాణా తదితర అంశాలపై నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి సమావేశం నిర్వహించారు. పక్కా ప్రణాళికతో ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని ఆదేశించారు. సన్నధాన్యం, దొడ్డు ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. దసరా నాటికి ఉపాధ్యాయుల నియామకం పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రాంనాథ్‌కేకన్, అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, డీసీవో వెంకటేశ్వర్లు, సివిల్‌సప్లయ్ డీఎం కృష్ణవేణి సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక రేపు

మానుకోట, న్యూస్‌టుడే: జిల్లాస్థాయి సీనియర్ మహిళ, పురుషుల బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికను ఈ నెల 5న నిర్వహిస్తున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ముల్లంగి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. క్రీడాకారులు అవసరమైన ధ్రువపత్రాలతో మహబూబాబాద్ బాలుర జూనియర్ కళాశాల బాస్కెట్ బాల్ ప్రాంగణంలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు హాజరుకావాలన్నారు. వివరాలకు శిక్షకుడు వెలిశాల కుమారస్వామిని చరవాణిలో సంప్రదించాలన్నారు.

ఉపాధి బాటలో.. ప్రతి పనికో రేటు..!

బయ్యారం (మహబూబాబాద్), న్యూస్‌టుడే: పల్లెల్లో పనుల్లేక ఇబ్బందులు పడుతున్న వ్యవసాయ కూలీలు, నిరుపేదలకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధిహామీ పథకంలోనూ అవినీతి రాజ్యమేలుతోంది. కొందరు అధికారులు, సిబ్బంది చేస్తున్న అక్రమాలు సామాజిక తనిఖీల్లో వెల్లడవుతున్నా.. వారిపై కఠినచర్యలు లేకపోవడంతో అక్రమాలు కొనసాగిస్తున్నారనే ఆరోపణలున్నాయి. బయ్యారం మండలంలో ఉపాధి హామీ పనులకు వెళ్తున్న కూలీలకు అలాంటి పరిస్థితులే ఎదురవుతున్నాయి. పనుల కోసం డిమాండ్ పెట్టాలన్నా.. మస్టర్ రావాలన్నా.. తమ పేర్లు ఆన్‌లైన్‌లో కనిపించాలన్నా.. చేసిన పనికి వేతనం సకాలంలో అందాలన్నా.. ఇలా ప్రతి పనికి అక్కడ పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ చేయి తడపాల్సిందేనని కొందరు ఉపాధి కూలీలు వాపోతున్నారు. చివరకు జాబ్‌కార్డుకు ఆధార్ అనుసంధానం చేయాలన్నా.. ఫోన్ పే..గూగుల్ పే చేయాల్సిందేనని కొందరు కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నిబంధనలకు విరుద్ధంగా జాబ్‌కార్డుల జారీ

గ్రామాల్లో ఉపాధిహామీ పనులకు వెళ్లాలనుకునే వారికి జాబ్‌కార్డులేని పక్షంలో సాధారణంగా క్షేత్రసహాయకుడికి దరఖాస్తు చేసుకొని పంచాయతీ కార్యదర్శి ఆమోదిస్తేనే జాబ్‌కార్డు తీసుకోవాల్సి ఉంటుంది. అలాంటిది ఆయన చేయి తడిపితే నేరుగా జాబ్‌కార్డు జారీ అవుతుంది. ఒక్కో జాబ్‌కార్డుకు రూ.500 నుంచి రూ.1200 వరకు వసూలు చేసినట్లు కొందరు ఆరోపిస్తున్నారు. ఇలా మండల వ్యాప్తంగా కొందరు మధ్యవర్తుల ప్రమేయంతో కొత్తగా జాబ్‌కార్డులను కంప్యూటర్ ఆపరేటర్ ద్వారా అందించినట్లు తెలుస్తోంది.

- ఓ తండాకు చెందిన మహిళ తమ కుటుంబం వేరుపడడంతో జాబ్‌కార్డు అవసరమై వెళ్లగా ఖర్చులపేరుతో డబ్బులు వసూలు చేశారని తెలిపారు. ఇలా జాబ్‌కార్డులు జారీచేస్తున్న విషయమై స్వయంగా కొందరు క్షేత్రసహాయకులు మే నెలలో ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు.

కుప్పలు..తెప్పలుగా వేతన బకాయిలు

ఉపాధి హామీ కూలీలు పనులకు వెళ్లిన క్రమంలో వారానికోసారి పేమెంటు స్లిప్పులు జారీ అవుతాయి. మూడు, నాలుగు వారాల్లోనే వేతనాలు కూలీల ఖాతాలో జమ అవుతాయి. మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధికూలీల వేతనాలు ఏడాది గడిచిన వేతనాలు జమ కాలేదు. దీనికి సమాధానం చెప్పాల్సిన ఆపరేటర్ పట్టించుకోవడంలేదని కూలీలు తెలిపారు.

☛ మండలకేంద్రానికి చెందిన జి.నర్సమ్మ 2023 జూన్, జులై, ఆగస్టు నెలల్లో హరితవనం పనులు చేశారు. దీనికి సంబంధించిన సుమారు రూ.13 వేల వేతనం ఏడాది గడిచినా బ్యాంక్‌లో జమ కాలేదు. ఆమె వేతనం కోసం ఆఫీసు చుట్టూ తిరుగుతున్నారు.. ☛ రంగాపురం గ్రామానికి చెందిన కె.మల్లమ్మ 2023లో చేసిన పనులకు సంబంధించి రూ.16వేలు వేతనం ఇప్పటి వరకు రాలేదు. అధికారులను అడిగినా సమాధానంలేదని వాపోతున్నారు. ☛ జగ్గుతండాకు చెందిన వసంత, శ్రీను గత ఏడాది వేతనం రూ.6,360 రాలేదు. మస్టర్‌ను నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ ఎన్ఎంఎంఎస్ చేయాలని లేనిపక్షంలో వేతనం ఆలస్యం అవుతుందని కూలీలను భయపెట్టి నగదు వసూలు చేస్తున్నట్లుగా ఆరోపణలున్నాయి.

- ఈవిషయమై ఇన్‌ఛార్జి ఎంపీడీవో దైవాదీనంను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా కూలీల వద్ద నుంచి డబ్బు వసూలు చేస్తున్న విషయం తమ దృష్టికి రాలేదన్నారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధిహామీ కూలీల వేతనాలు మంజూరైనట్లు త్వరలోనే బ్యాంకుల్లో జమ చేస్తామన్నారు.

అందరం ఒకటిగా..



ర్యాగింగ్‌కు దూరంగా

ఇంజినీరింగ్, ఫార్మసి తరగతులు ఇటీవల ప్రారంభమయ్యాయి. నీట్ కౌన్సెలింగ్ ముగించుకొని త్వరలో వైద్య విద్యార్థులు కళాశాలలకు రానున్నారు. కొత్త కళాశాలలు.. కొత్త వాతావరణం.. దీనికి తోడు ర్యాగింగ్ భయం. ఇంటర్మీడియట్ పూర్తి చేసుకొని బయటకొచ్చిన విద్యార్థులకు ఇక్కడ కాస్త బెరుకుగానే ఉంటుంది. సీనియర్ల శ్రుతి మించిన చేష్టలు వారిని ఆందోళనకు గురిచేస్తుంటాయి. ఈ భయం పోగొట్టడానికి కళాశాలల్లో యాజమాన్యాలు, అధ్యాపకులు కృషి చేయాలి..

–న్యూస్‌టుడే, విద్యానగర్, హసన్‌పర్తి

● 2021 సెప్టెంబర్.. వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం సృష్టించింది. ఉత్తరాదికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్తకు చెందిన విద్యార్థిని ర్యాగింగ్ చేయడం సంచలనం సృష్టించింది. కేంద్రస్థాయిలో ఒత్తిడి రావడంతో విచారణ జరిపి చర్యలు తీసుకున్నారు.

● గతేడాది రాజస్థాన్‌కు చెందిన ప్రథమ సంవత్సరం విద్యార్థిని ర్యాగింగ్ చేసిన ఏడుగురు విద్యార్థులపై మట్టెవాడ పోలీసులు కేసులు నమోదు చేశారు.

ఈ విషయంలో జాగ్రత్త..

- ఇతర విద్యార్థుల పట్ల అమానుషంగా, కఠినంగా వ్యవహరించడం
- మొబైల్ ఫోన్ల ద్వారా ఫొటోలు, వీడియోలు తీయడం
- శారీరకంగా, మానసికంగా వేధించడం
- సామాజిక మాధ్యమాల్లో అసభ్యంగా ప్రవర్తించడం

ఏం చేయాలంటే..

ర్యాగింగ్ నిరోధానికి ప్రభుత్వం 1997లో చట్టం తీసుకొచ్చింది

- ప్రతి విద్యాసంస్థలో అనుభవం ఉన్న ప్రొఫెసర్, స్థానిక పోలీసు అధికారి భాగస్వామ్యంతో కమిటీలను ఏర్పాటు చేయాలి.
- చట్టాలను అతిక్రమిస్తే విధించే శిక్షలు తెలిపే బోర్డులను ప్రతి విద్యాలయంలో అందరికీ కనిపించే ప్రదేశాల్లో ఉంచాలి.

కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని కళాశాలల్లో ర్యాగింగ్ నిరోధక గోడ పత్రాలు ప్రదర్శిస్తామని రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి తెలిపారు.

కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలలు (ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాలు)

కళాశాలలు	సంఖ్య
ఇంజినీరింగ్ కళాశాలు	7
పీజీ	72
ఫార్మసీ	37
డిగ్రీ	262
ఎంబీఎ, ఎంసీఏ	30
గురుకుల డిగ్రీ	30
బి.ఎడ్	41
న్యాయ	4

అతిక్రమిస్తే శిక్షలు తప్పవు..

- రూ.2.50 లక్షల వరకు జరిమానా.
- సదరు విద్యార్థి ప్రవేశం రద్దు చేసి, కళాశాల నుంచి బహిష్కరణ.
- మరే ఇతర కాలేజీలో చేరే అవకాశం లేకుండా చేయటం.
- పోలీసు కేసు నమోదు..



కేయూలో యాంటీ ర్యాగింగ్ గోడపత్రిక విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, అధ్యాపకులు

పకడ్బందీగా యాంటీ ర్యాగింగ్ కమిటీలు..


హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అనంతసాగర్ శివారులోని ఎస్సార్ విశ్వవిద్యాలయం, భీమారంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో 2009లో యాంటి ర్యాగింగ్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఏటా బీటెక్, ఫార్మసీ, ఎంబీఏ, అగ్రికల్చర్ బీఎస్సీలో చేరుతున్న విద్యార్థులకు ర్యాగింగ్ సమస్య తలెత్తకుండా విశ్వవిద్యాలయం అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పూర్తికాగానే యాంటి ర్యాగింగ్‌పై సదస్సులు ఏర్పాటు చేసి, పోలీసు అధికారులతో పాటు ఇతర శాఖలకు చెందిన ఉన్నతాధికారులతో అవగాహన కల్పిస్తున్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే పోలీసు శాఖ చర్యలు, చట్టాల గురించి వివరిస్తున్నారు. దీనికి తోడు క్రమశిక్షణ కమిటీలను ఆయా విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్లు, విద్యార్థి సంఘం ప్రతినిధులతో కలిసి ఏర్పాటు చేస్తున్నారు. ర్యాగింగ్ రహిత విశ్వ విద్యాలయాలుగా తీర్చిదిద్దడానికి అధ్యాపకులు, విద్యార్థి ప్రతినిధులు కృషి చేస్తున్నారు.

డయల్ 100కు కాల్ చేయండి..: - ఎస్‌కె. సలీమా, సెంట్రల్ జోన్ డీసీపీ

విద్యార్థులకు ర్యాగింగ్ సమస్య ఎదురైనప్పుడు డయల్ 100కు కాల్ చేయాలి. 5 నిమిషాల్లో పోలీస్ పెట్రోలింగ్ వాహనం మీ ముందు ఉంటుంది. విద్యార్థినులకు రక్షణగా షీ బృందాలు 24 గంటలు అందుబాటులో ఉంటాయి. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. విద్యార్థులు పోటీ తత్వంతో చదవాలి. ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువును కొనసాగించాలి. సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలి.



ఎస్సార్ విశ్వ విద్యాలయంలో జరిగిన యాంటీ ర్యాగింగ్ సదస్సులో మాట్లాడుతున్న సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా



పరిచయ కార్యక్రమాలతో ప్రోత్సాహం

- ప్రవళిక, ఇంజినీరింగ్ మూడో సంవత్సరం, మహిళా ఇంజినీరింగ్ కళాశాల, కేయూ క్యాంపస్

విద్యా సంవత్సరం ప్రారంభంలో అధ్యాపకుల సహకారంతో మొదటి సంవత్సరం విద్యార్థులతో పరిచయ కార్యక్రమాలు నిర్వహిస్తాం. దీనిద్వారా కొత్తవారికి భయం పోతుంది. వారిని సహ సంబంధ కార్యక్రమాల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహిస్తాం. కలివిడిగా ఉండడం ద్వారా సీనియర్, జూనియర్ అనే తేడా ఉండదు.



భయం పోయింది..

- యాకేష్, ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం, కోఎడ్యుకేషన్ కళాశాల, కేయూ క్యాంపస్

ఇంటర్ తర్వాత ఇంజినీరింగ్ అంటే కొంత భయంగా ఉండేది. సీనియర్లు మమ్మల్ని ప్రోత్సహించే విధంగా ఉండాలి. అధ్యాపకులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వల్ల బిడియం, భయం పోయాయి. సందేహాల నివృత్తికి సీనియర్, జూనియర్ విద్యార్థుల భాగస్వామ్యం అవసరం.

వైభవంగా దేవీ శరన్నవరాత్రులు



బాలాత్రిపుర సుందరీగా భద్రకాళి



జ్యోతి వెలిగించి ఉత్సవాలు ప్రారంభిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి దంపతులు

రంగంపేట, న్యూస్‌టుడే: తెలంగాణ ఇంద్రకీలాద్రిగా పేరుగాంచిన శ్రీభద్రకాళి అమ్మవారి ఆలయంలో గురువారం శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు జ్యోతి వెలిగించి ఉత్సవాలను ప్రారంభించారు. తొలిరోజు బాలా త్రిపురసుందరీగా శ్రీభద్రకాళి అమ్మవారు దర్శనమిచ్చారు. అంతకుముందు ప్రధానార్చకుడు శేషు ఆధ్వర్యంలో అమ్మవారికి పూర్ణాభిషేకం చేశారు. అనంతరం ఉత్సవానుజ్ఞ ప్రార్థన, గణపతి పూజ, ధ్వజారోహణం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన స్వర్ణ కిరీటం, జుటా మకుటాలు, కర్ణ పత్రాలను భద్రకాళి అమ్మవారికి అలంకరించారు. ఉదయం వృషభ వాహన సేవ, సాయంత్రం మృగ వాహన సేవలు జరిగాయి. భవానీ దీక్షదారులు, భక్తులు, మహిళలతో దేవాలయం కిటకిటలాడింది. మధ్యాహ్నం, రాత్రి మహా అన్నదానం చేశారు.

● రెండోరోజు శుక్రవారం శ్రీభద్రకాళి అమ్మవారిని అన్నపూర్ణ మాతగా అలంకరిస్తారని, ఉదయం బ్రహ్మచారిణి దుర్గార్చన, 11 గంటలకు మకర వాహన సేవ, సాయంత్రం చంద్రప్రభ వాహన సేవలుంటాయని ఈవో శేషుభారతి తెలిపారు.

తొర్రూరులో 'కాసం ఫ్యాషన్స్' ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీనటి ప్రియాంక మోహన్, నిర్వాహకులు

తొర్రూరు, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని టీచర్స్ కాలనీ ప్రధాన రహదారి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన 'కాసం ఫ్యాషన్స్' మాల్ 13వ స్టోర్‌ను గురువారం సినీనటి ప్రియాంక మోహన్ ప్రారంభించారు. మొదట జ్యోతి వెలిగించి మాల్‌లోని లేడీస్, జెంట్స్, కిడ్స్‌వేర్ దుస్తులను పరిశీలిస్తూ సందడి చేశారు. ఆమె మాట్లాడుతూ.. ఈ ప్రాంత ప్రజలకు నాణ్యమైన అధునాతన వస్త్రాలను సరసమైన ధరలకే అందించడానికి కాసం సెలక్షన్స్ నూతన స్టోర్‌ను అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమన్నారు. షాపింగ్‌మాల్ డైరెక్టర్‌లు కాసం ఓంనమఃశివాయ, మల్లికార్జున్, కేదారినాథ్, శివప్రసాదులు మాట్లాడుతూ.. బతుకమ్మ, దసరా, దీపావళి సందర్భంగా నూతన స్టాక్ అందుబాటులో ఉందని పేర్కొన్నారు. సినీనటి ప్రియాంకమోహన్‌ను చూడటానికి యువత పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఆ ప్రాంతమంతా సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో నిర్వాహకులు కాసం ఫణి, సాయికృష్ణ, ధీరజ్, ప్రీతమ్, ప్రవీణ్, పల్లూరి అరుణ్‌కుమార్, వరుణ్, తదితరులు పాల్గొన్నారు.

● సినీనటి ప్రియాంకమోహన్‌తోపాటు కాంగ్రెస్ పాలకుర్తి ఇన్‌ఛార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి మాల్ ముందు ఏర్పాటు చేసిన స్టేజిని ఎక్కుతున్న తరుణంలో అది ఒక్కసారిగా కూలిపోయింది. ఝాన్సీరెడ్డికి గాయాలు కావడంతో చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. మిగతా ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు.

సెమీస్‌కు చేరిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఓరుగల్లు కేంద్రంగా జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్-19 క్రికెట్ పోటీలు సెమీస్‌కు చేరాయి. గురువారం కోమటిపల్లి మైదానంలో నిజామాబాద్, ఖమ్మం ఉమ్మడి జిల్లా జట్ల మధ్య జరిగిన ఉత్కంఠ పోరులో ఒక్క వికెట్ తేడాతో ఖమ్మం విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన నిజామాబాద్ జట్టు నిర్ణీత 35 ఓవర్లలో 207 పరుగులు చేసింది. విక్రాంత్‌రెడ్డి 137 పరుగులతో రాణించాడు. ఛేదనలో ఖమ్మం జట్టు నిర్ణీత 35 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 208 పరుగులు చేసి.. సెమీస్‌లోకి దూసుకెళ్లింది. దివిన్ 75, రత్న ఆర్యన్ 45 పరుగులతో విజయంలో కీలకపాత్ర పోషించారు.

● మొగిలిచర్ల మైదానంలో జరిగిన మరో మ్యాచ్ ఆదిలాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల జట్లు పాల్గొన్నాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కరీంనగర్ జట్టు 46.3 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో విజ్ఞాన్ 59 పరుగులతో రాణించాడు. ఛేదనలో ఆదిలాబాద్ జట్టు 32.3 ఓవర్లలో 102 వద్ద కుప్పకూలింది. జట్టులో ఆల్‌రౌండర్ తక్షిల్ 39 పరుగులు చేసి 3 వికెట్లు తీశాడు. శుక్రవారం కోమటిపల్లి మైదానంలో కరీంనగర్, నల్గొండ: మొగిలిచర్ల మైదానంలో మహబూబ్‌నగర్, ఖమ్మం జట్ల మధ్య సెమీస్ మ్యాచ్‌లు ఉంటాయని వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	112
రిటైల్:	134
డ్రెస్డ్:	194
స్కిన్‌లెస్:	221

అడవిని చూసొద్దాం..

వన్యప్రాణులను కాపాడుదాం









రోజురోజుకు వన్యప్రాణులు అంతరించిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వం వాటి రక్షణకు చర్యలు చేపడుతున్నా వేటగాళ్ల ఉచ్చుకు బలవుతున్నాయి. ఉమ్మడి వరంగల్‌లో విస్తారంగా ఉన్న అటవీ ప్రాంతంలో అనేక అరుదైన వన్యప్రాణులు ఉన్నాయి.. మనకు విస్తారమైన అటవీ ప్రాంతం ఉంది. ఆ అందాలను వీక్షిస్తూనే అందులో నివసిస్తున్న వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన అవసరం అందరిపై ఉంది.. శుక్రవారం ప్రపంచ జంతు సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కథనం.

ఏటూరునాగారం, న్యూస్‌టుడే

● ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో మొత్తం 6.26 లక్షల హెక్టార్లలో అడవులు విస్తరించి ఉన్నాయి.

ఏటూరునాగారం అభయారణ్యంలో అటవీ శాఖ ఏర్పాటు చేసిన కెమెరాలకు ఇటీవల చిక్కిన వన్యప్రాణులు..









సంరక్షణ చర్యలు ఇలా..

ఏటూరునాగారం అభయారణ్యం మొత్తం 806 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 146 గ్రామాలతో, ఏటూరునాగారం నాలుగు రేంజి కార్యాలయాలతో విస్తరించి ఉంటుంది. ఇందులోని వన్యప్రాణులను కాపాడేందుకు అటవీ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. సాసర్ పిట్లు, నీటి తొట్టెలలో ప్రతి రోజూ నీటిని పోయడం, నిర్మానుష్య ప్రదేశాలలో అడవి జంతువులు సంచరించే ప్రాంతాల్లో ఉప్పు గడ్డలు వేయడం, పచ్చిగడ్డిని నీటి తొట్లు, సాసర్‌పిట్లు ఉన్న చోట వేయడం వంటి కార్యక్రమాలను చేపడుతున్నారు. అటవీ అధికారులు ఎవరి బీట్ పరిధిలో వారు నిత్యం క్షేత్రస్థాయి పర్యటన చేస్తూ అడవులో వేటగాళ్లు విద్యుత్తు తీగలు అమర్చారా, ఉచ్చులు అమర్చారా అని పర్యవేక్షిస్తుంటారు. అడవి జంతువుల ఆనవాళ్లు ఎక్కడ ఉన్నాయి, ఉన్నాయా? లేవా అని తెలుసుకునేందుకు అవి సంచరించే నిర్జన ప్రదేశాల్లో కెమెరా ట్రాప్స్ ఏర్పాటు చేస్తారు. ప్రధానంగా అడవిలో నీటి వనరులున్న చోట కెమెరా ట్రాప్‌లు, ఉప్పు గడ్డల వంటివి ఏర్పాటు చేసి వాటి ఆనవాళ్లు సేకరిస్తారు.



ఏటూరునాగారం సబ్ డివిజన్‌లోని అడవి విస్తీర్ణం తెలిపే మ్యాపు

● ములుగు జిల్లాలో 7,27,821 ఎకరాల్లో అడవులు ఉన్నాయి. ములుగు, తాడ్వాయి, వెంకటాపురం, ఏటూరునాగారం సబ్ డివిజన్లతో 13 అటవీ రేంజి కార్యాలయాలతో 77 బ్లాకులతో అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు అటవీశాఖ పని చేస్తోంది. ఇందులో 806.15 చదరపు కిలో మీటర్ల పరిధిలో వన్యప్రాణి సంరక్షణ కేంద్రం విస్తరించి ఉంది.

చట్టం ఏం చెబుతుందంటే..

వన్యప్రాణులను వేటాడటం నిషేధమని వన్యప్రాణుల సంరక్షణ చట్టం-1972 చెబుతోంది. అభయారణ్యంలో వేటగాళ్లు నిత్యం అడవి జంతువుల పాలిట మరణమృదంగాన్ని మోగిస్తూనే ఉన్నారు. వేటగాళ్లు అమర్చే ఉచ్చులు, విద్యుత్తు తీగలు వన్యప్రాణుల ప్రాణాలు ఏదో ఒక ప్రాంతంలో కబలిస్తూనే ఉన్నాయి.

● వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం అటవీ జంతువులను వేటాడినట్లు రుజువైతే మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.25 వేలు జరిమానా విధిస్తారు. ఏ ఒక్కరికీ ఈ శిక్షలు పడిన దాఖలాలు లేవు.

వారోత్సవాలకు శ్రీకారం..



వన్యప్రాణుల సంరక్షణకు పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక(యునైటెడ్ ఫోరమ్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్), జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడిగా కృషి చేస్తున్నామని విశ్రాంత జిల్లా అటవీ అధికారి కాజీపేట పురుషోత్తం అన్నారు. ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ అధ్యక్షుడు ఇందారం నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఈ సంస్థలు వన్యప్రాణులు అంతరించిపోకుండా సంరక్షణకు నడుం బిగించాయి. ఈ నెల 2 నుంచి 8 వరకు జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహిస్తున్నారు.

ఆరుబయట ఆసుపత్రి వ్యర్థాలు



వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఆవరణలో..

నగరంలో ఆసుపత్రి వ్యర్థాలు యథేచ్ఛగా ఆరుబయట పడేస్తున్నారు. 'బయో మెడికల్ వేస్ట్ ప్లాంట్'కు తరలించాల్సిన వాటిని వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఆవరణలో కుప్పలుగా పోశారు. ప్రతి ఆసుపత్రిలోని వ్యర్థాలను 'బయోవేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్'కు అప్పగించాల్సి ఉంటుంది. నేత్ర వైద్యశాలలో అలా చేయకుండా ఆసుపత్రి ఆవరణలో పడేయడంతో కుక్కలు, పందులు వాటిని చిందరవందర చేస్తున్నాయి. దీనివల్ల అనేక అనర్థాలు జరుగుతాయని తెలిసినా.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, ఎంజీఎం ఆసుపత్రి



నీటిలో పచ్చని ప్రతిబింబం..!

మహబూబాబాద్ జిల్లా కేంద్రం సమీపంలోని కంబాలపల్లి చెరువు చుట్టూ ప్రకృతి సౌందర్యం కనువిందు చేస్తోంది. ఇటీవల కురిసిన భారీవర్షాలకు జలకళ సంతరించుకొంది. జలాశయం చుట్టూ ఉన్న పచ్చని చెట్లతోనిండిన గుట్ట ప్రతిబింబం చెరువులో పచ్చందాలు పరిచినట్లు కనిపిస్తూ చూపరులను ఆకట్టుకొంటోంది. –న్యూస్‌టుడే, మహబూబాబాద్ రూరల్

వృత్తి నైపుణ్యంతోనే విధుల్లో రాణింపు



పోలీసు డ్యూటీ మీట్‌లో అధికారుల పనితీరును పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పోలీశాఖలో పనిచేస్తున్న అధికారులు విధుల్లో రాణించాలంటే వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. గురువారం కమిషనరేట్‌లో వరంగల్, ఖమ్మం కమిషనరేట్లు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన అధికారుల జోనల్ డ్యూటీ మీట్‌ను ఆయన ప్రారంభించారు. పోలీసు అధికారులకు కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, వేలిముద్రల సేకరణ, హ్యాండ్లింగ్, ప్యాకింగ్ లిఫ్టింగ్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్, ఫొటో, వీడియోగ్రఫీ పోటీలు నిర్వహించారు. ఒక్కో విభాగంలో ఇద్దరు చొప్పున ప్రతిభ కనబర్చినవారిని ఎంపిక చేసి, హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోలీసు డ్యూటీ మీట్‌కు పంపించనున్నారు. సీపీ మాట్లాడుతూ.. నేరాలు కొత్తకొత్త పద్ధతుల్లో జరుగుతున్నాయని, వాటిని నియంత్రించాలంటే.. విచారణ నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. అదనపు డీసీపీ రవి, జోనల్ ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

మంత్రి సీతక్క మది దోచిన 'ఈనాడు' చిత్రం

ప్రకృతి పర్యాటకానికి ప్రసిద్ధి గాంచిన ములుగు జిల్లాలోని అడవుల అందాలను 'అచ్చంగా అమెజాన్ అడవిలా.. కొండ్రేడు అందాలిలా.. అనే శీర్షికతో గురువారం ఈనాడు ప్రధాన పత్రిక మొదటి పేజీలో ప్రచురితమైన చిత్ర కథనం మంత్రి సీతక్కను అమితంగా ఆకర్షించింది. ప్రకృతి రమణీయ చిత్రాన్ని 'ఈనాడు' రాష్ట్రానికి తెలియజేయడం అభినందనీయమని అన్నారు. ములుగు జిల్లాలో గురువారం ఆమె పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మంగపేటలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఈనాడు చిత్ర కథనాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు.

–మంగపేట, న్యూస్‌టుడే

భారీగా గుట్కా పట్టివేత



గుట్కాను స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: అక్రమంగా రవాణా చేస్తున్న నిషేధిత గుట్కాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వరంగల్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ. మధుసూదన్ కథనం మేరకు... కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన ఆర్.శ్రీధర్ వ్యాన్‌లో గుట్కా తీసుకొని వరంగల్‌లోని పాన్ దుకాణానికి సరఫరా చేసేందుకు వస్తున్నట్లు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నిఘా ఉంచారు. గురువారం ఎనుమాముల ఠాణా పరిధిలోని ఎన్టీఆర్‌నగర్ వద్ద వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో వివిధ కంపెనీలకు చెందిన రూ.8.91లక్షల విలువ చేసే గుట్కా లభించింది. వ్యాన్‌ను సీజ్ చేసి, పాన్ దుకాణం యజమాని కృష్ణతో పాటు సరఫరా చేస్తున్న శ్రీధర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కేసు నమోదు, విచారణ కోసం ఎనుమాముల పోలీసులకు అప్పగించామని ఏసీపీ తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజు, ఆర్ఎస్సై భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

బామ్మ బంగారం.. దొరికిందోచ్!



కొంతమందికి పట్టిందల్లా బంగారం అవుతుందని అంటారు.. నిజమే..! తెలియకుండానే ఓ వ్యక్తి బియ్యం పట్టుకుంటే బంగారం అయ్యింది.. అది ఎంతోసేపు నిలవలేదు. చివరికి వచ్చిన చోటుకే చేరి కథ సుఖాంతమైంది. స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని సముద్రాల గ్రామానికి చెందిన కట్ల సోమలక్ష్మి అనే వృద్ధురాలు ప్రభుత్వం ఇచ్చిన రాయితీ బియ్యం సంచిలో ఐదు తులాల బంగారం దాచి పెట్టింది. గ్రామంలో ఓ వ్యక్తికి మంగళవారం సాయంత్రం ఆ బియ్యం సంచి విక్రయించింది. బంగారం దాచుకున్న సంచి వేరే ఉందని భావించింది. అయితే ఆ సంచిని తెరిచి చూడగా అందులో బంగారం కనిపించలేదు. బంగారం దాచిన బియ్యం సంచినే విక్రయించినట్లు గుర్తించి లబోదిబోమంటూ విషయం కుటుంబసభ్యులకు వివరించింది. బియ్యం కొనుగోలు చేసిన వ్యక్తి మరుసటి రోజు మళ్లీ అదే గ్రామానికి రాగా అతన్ని పట్టుకొని విషయం చెప్పగా.. గ్రామంలోని ఓచోట 15 బస్తాల వరకు బియ్యాన్ని నిల్వ చేసినట్లు చెప్పాడు. కుటుంబసభ్యుల సాయంతో బియ్యం సంచులను విప్పి వెతకగా బంగారం దొరికింది. దీంతో వృద్ధురాలు సోమలక్ష్మితో పాటుగా కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

– న్యూస్‌టుడే, స్టేషన్‌ఘన్‌పూర్

త్వరలో నూతన భవనంలోకి పీహెచ్‌సీ



భవనాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి మురళీధర్, అధికారులు

కురవి, న్యూస్‌టుడే: కురవి మండలం బలపాలలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని జిల్లా వైద్యాధికారి మురళీధర్ అన్నారు. 'ఆసుపత్రి భవానికి మోక్షమెప్పుడో' శీర్షికతో సెప్టెంబరు 26న 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మురళీధర్ సిబ్బందితో కలిసి గురువారం బలపాలలో రూ. 1.50 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని పరిశీలించారు. త్వరలోనే వైద్య సేవలను నూతన భవనం నుంచి కొనసాగిస్తామన్నారు. జిల్లా కీటక నియంత్రణ అధికారి సుధీర్‌రెడ్డి, కావేటి మంగమ్మ, రామకృష్ణ, స్రవంతి, కుమారస్వామి, విజయ ఉన్నారు.

సార్వత్రిక పరీక్షలు ప్రారంభం

మానుకోట, న్యూస్‌టుడే: తెలంగాణ ఓపెన్ సొసైటీ (టాస్) పదో తరగతి, ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం జిల్లా కేంద్రంలో ప్రారంభమైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి వి. రాజేశ్వర్, పరీక్షల నిర్వహణాధికారి మందుల శ్రీరాములు తెలిపారు. బాలికల ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రంలో ఇంటర్మీడియట్‌లో 44 మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రంలో 51 మంది పదోతరగతి విద్యార్థులు పరీక్షలు రాశారన్నారు.

తల్లీ.. దీవించు!



మహబూబాబాద్‌లో..



కేసముద్రంలోని ఆర్యవైశ్య భవనంలో..



కేసముద్రంలోని సాయిబాబా ఆలయంలో..



బయ్యారం గాంధీసెంటర్‌లో కొలువుదీరిన దుర్గామాత

న్యూస్‌టుడే, బృందం: జిల్లాలోని పలు గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో సుందరంగా తీర్చిదిద్దిన మండపాల్లో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. మొదటి రోజున అమ్మవారు శైలపుత్రిగా, బాలాత్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. డోర్నకల్‌లోని శ్రీముత్యాలమ్మపల్లి గుడిలో స్వర్ణకవచాలంకృత, శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీబాల త్రిపుర సుందరీదేవి అవతారంలో దుర్గామాతని భక్తులు దర్శించుకున్నారు.



డోర్నకల్‌లో..



జిల్లా కేంద్రంలో..



దంతాలపల్లిలో..



కురవిలో..



మహబూబాబాద్‌లో అమ్మవారికి అలంకరణ సామగ్రి తీసుకెళ్తున్న భక్తులు



గార్ల: బాల త్రిపుర సుందరీదేవికి భవానీల పూజలు



మరిపెడ మండల పరిషత్ సభావేదికలో..



నెల్లికుదురులో ..

మేమున్నాం.. మీకు తోడుగా

మహబూబాబాద్ టౌన్: 98859 29762, మహబూబాబాద్: 9441084123, తొర్రూరు టౌన్: 97019 14499, డోర్నకల్: 94405 15786, మరిపెడ: 80085 74823

డోర్నకల్, న్యూస్‌టుడే: అమ్మపాలెంలోని అంతర్గత వీధిలో వీధి దీపం వెలగడం లేదు. కొత్తది ఏర్పాటు చేయాలి. - రమేష్

తగు చర్యలు తీసుకుంటాం. - మున్వర్‌బేగ్, ఎంపీవో, డోర్నకల్

చెత్త తొలగింపు

స్పందనకు వందనం

డోర్నకల్, న్యూస్‌టుడే: డోర్నకల్ యాదవ్‌నగర్‌లో రోడ్డు ప్రక్కన పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని సిబ్బంది గురువారం తొలగించారు. పరిసరాలు శుభ్రం చేయడంతో దుర్వాసన తొలగిందని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

పెండింగ్ వేతనాలు చెల్లించకుంటే సమ్మె

మహబూబాబాద్, న్యూస్‌టుడే: బయ్యారం మండలానికి చెందిన ఐకేపీ వీవోఏలకు 2017 నుంచి పెండింగ్ వేతనాలను చెల్లించకుంటే సమ్మె చేస్తామని సీఐటీయూ కార్యదర్శి కుంట ఉపేందర్ స్పష్టం చేశారు. తమ వేతనాలను చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ఐకేపీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ధర్నా నిర్వహించారు. 17 మంది వీవోఏలకు 2017 నుంచి వేతనాలు అవ్వడం లేదన్నారు. ఒక్కొక్కరికి రూ. 45 వేల వరకు బకాయిలు ఉన్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా వేతనాలు రానివారు సుమారు 50 మంది ఉన్నారన్నారు. సంఘం అధ్యక్షురాలు నీలం కృష్ణవేణి, బయ్యారం మండలం అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల వసంత, గొగ్గెల కృష్ణకుమారి, ఐక్యుల శ్రీను అశ్విని డీఆర్‌డీవో అధికారులకు వినతి పత్రం అందించారు.

అడవి జంతువుల వేటపై విచారణ

బయ్యారం, న్యూస్‌టుడే: మండలంలోని మరో గ్రామంలో అడవిపందిని వేటాడిన సంఘటనపై అటవీశాఖ అధికారులు విచారణ కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఓ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అడవి జంతువులను వేటాడినట్లు సమాచారం రావడంతో అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లి మాంసాన్ని స్వాధీనం చేసుకొని నిర్ధారణ పరీక్షలకు పంపినట్లు సమాచారం. జంతువుల వేటాడిన ఓ వ్యక్తిని సైతం అదుపులోకి తీసుకొని అమావాస్య కావడంతో విడిచిపెట్టినట్లు ప్రచారం జరుగుతుంది. ఈవిషయమై అటవీశాఖ అధికారులను వివరణ కోరగా విచారణ చేస్తున్నామని అనంతరం వివరాలు వెల్లడిస్తామన్నారు.



మహబూబాబాద్ పట్టణంలోని సాలార్‌తండాలో ..



మరిపెడ 14వ వార్డులో..

ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే ప్రారంభం

మహబూబాబాద్, దంతాలపల్లి, మరిపెడ, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే కార్యక్రమం గురువారం ప్రారంభమైంది అధికారుల బృందాలు ఉదయమే ఆయా గ్రామాలను సందర్శించి వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు. మహబూబాబాద్ పురపాలక సంఘం ఏడో వార్డు పరిధిలోని సాలార్ తండా, రజాలీపేటలో కార్యక్రమాన్ని ఆర్డీవో ఎల్. అలివేలు పర్యవేక్షించగా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. కమిషనర్ నోముల రవీందర్, డీఈ విప్పు ఉపేందర్, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. దంతాలపల్లి మండలం రామవరం గ్రామంలో ఎంపీడీవో వివేక్‌రామ్, తహసీల్దార్ చంద్రశేఖర్‌రావుతో తదితర అధికారులు సర్వేను చేపట్టారు. ఆర్డీవో కృష్ణవేణి పరిశీలించారు. మరిపెడ పురపాలిక 14వ వార్డులో పురపాలిక కమిషనర్ వెంకటస్వామి నేతృత్వంలో అధికారుల బృందం నిర్దేశిత నమూనాలో వివరాల సేకరణ ప్రారంభించారు. ప్రభుత్వం సూచించిన విధంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ మహబూబాబాద్ పురపాలక సంఘం ఏడో వార్డు పరిధిలోని సాలార్‌తండా, రజాలీపేటలో చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను పరిశీలించారు. సర్వే బృందాలతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన విధంగా అన్ని వివరాలతో సమగ్ర సర్వే చేపట్టాలన్నారు. జిల్లాలోని రెండు గ్రామాలు, మూడు పురపాలక సంఘాల్లోని మూడు వార్డుల్లో సర్వే జరుగుతుందన్నారు.



రామవరంలో

నేడు ఉచిత వైద్య శిబిరం

తొర్రూరు, న్యూస్‌టుడే: డివిజన్ కేంద్రంలోని లయన్స్ భవనంలో శుక్రవారం(నేడు) తొర్రూరు ప్రైవేట్ డాక్టర్స్, మెడికల్ అసోసియేషన్ సహకారంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి కోశాధికారిలు నవీన్‌కుమార్, రమేష్, శంకర్‌లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. కంటి పరీక్షలతోపాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు, ఆపరేషన్లు నిర్వహిస్తామని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎర్రజెండాలతోనే సమస్యలు పరిష్కారం

తొర్రూరు, న్యూస్‌టుడే: ఎర్రజెండా పార్టీలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని, వామపక్ష పార్టీలను బలపరచుకోవాల్సిన అవసరం ఉందని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఆలకుంట్ల సాయిలు తెలిపారు. మండలంలోని మాటేడు గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన 12 కుటుంబాలు గురువారం పార్టీలో చేరగా ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ.. భూమి, భుక్తి, విముక్తి కోసం నూతన ప్రజాస్వామిక విప్లవమే ఏకైక మార్గమన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు యాకయ్య, శ్రీకాంత్, వెంకన్న, లింగాచారి, సోమయ్య, అనిల్, అజయ్ పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

పెద్దవంగర, న్యూస్‌టుడే: రాష్ట్రంలో రైతాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నట్టేట ముంచిందని భారాస మండలాధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. శుక్రవారం(నేడు) డివిజన్ కేంద్రంలో నిర్వహించే మహాధర్నాలో భాగంగా మండలంలోని బొమ్మకల్, పోచారం, కొరిపల్లి గ్రామాల ముఖ్య కార్యకర్తలతో గురువారం సమావేశం నిర్వహించారు. మహాధర్నాలో మాజీ మంత్రులు హరీష్‌రావు, దయాకర్‌రావులు పాల్గొంటారని రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నేతలు గంగాధర్, వెంకట్‌రెడ్డి, యాకన్న, నరేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

డోర్నకల్, న్యూస్‌టుడే: డోర్నకల్ మీదుగా అక్రమంగా రవాణా చేస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఇక్కడి బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద తనిఖీ నిర్వహిస్తుండగా వాహనం ఒకటి అనుమానాస్పదంగా కనిపించింది. ఎస్సై వంశీధర్ నేతృత్వంలో సోదా నిర్వహించి 16 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. వీటిని గార్ల మండలం బుద్దారం శివారు నుంచి తీసుకొస్తున్నట్లు తెలుసుకున్నారు. నిందితులను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు శివారులోని సత్యనారాయణపురానికి చెందిన పెండ్ర రామారావు, లింగనబోయిన నవీన్ అలియాస్ నాగేశ్వరరావుగా గుర్తించారు. వీరిద్దరిని అరెస్టు చేశారు. బియ్యంతో పాటు అక్రమ రవాణాకి వినియోగించిన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై వంశీధర్ తెలిపారు

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్

మహబూబాబాద్, న్యూస్‌టుడే: ప్రజల సమస్యలపై పోరాడుతున్న సీపీఎం స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన గుమ్ముడూరు 1, 2, 3 శాఖల మహాసభలను శ్రీనివాస్ ప్రారంభించారు. ప్రజల కోసం ఎవరూ పోరాటాలు చేస్తున్నారో గుర్తించి వచ్చే ఎన్నికల్లో ఆదరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలు చేస్తూ ప్రజల్లో గందరగోళ పరిస్థితులు సృష్టిస్తున్నారన్నారు. సమావేశంలో సీపీఎం పురపాలక సంఘం ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య, కుర్ర మహేష్, సీతారాంనాయక్, అల్లి శ్రీనివాసరెడ్డి, యాకయ్య, విజయలక్ష్మి, ప్రశాంత్, నూనె శ్రీనివాస్, చింతల భిక్షపతి పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాలు



మానుకోటలో బహుమతులు అందజేస్తున్న జేవీవీ జిల్లా కమిటీ బాధ్యులు

మహబూబాబాద్ టౌన్, బయ్యారం, న్యూస్‌టుడే: జన విజ్ఞాన వేదిక మానుకోట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ఎస్వీ టవర్స్ ఆవరణలో మహిళలతో బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. అనంతరం ఉత్తమ బతుకమ్మ పేర్చిన మహిళలకు బహుమతులను అందజేశారు. జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యుడు తడకమళ్ల బ్రహ్మం, ప్రధానకార్యదర్శి చొప్పరి శ్రీనివాస్, కోశాధికారి యిమ్మడి సునీత, అధ్యక్షుడు సాహితి శ్రీనివాస్, సమతా కన్వీనర్ వై. ఉమాదేవి, చకిముకి కన్వీనర్ జంపాల యాకయ్య, ఆరోగ్య విభాగం కన్వీనర్ తేలుకుంట్ల సునితా, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బయ్యారం జూనియర్ కళాశాలలో బతుకమ్మలతో విద్యార్థులు, అధ్యాపకులు

● బయ్యారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. కళాశాల విద్యార్థినులు, అధ్యాపకులు, ప్రిన్స్‌పల్ వీరస్వామి తదితరులున్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ తిరుపతిరావు

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: మహబూబాబాద్, కురవి పరిసర ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలను అపహరించిన నిందితుడ్ని అరెస్టు చేసి అతని నుంచి రూ. 4.30 లక్షల విలువైన పది వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు తెలిపారు. గురువారం మహబూబాబాద్ పట్టణ ఠాణాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడిని అరెస్టు చూపి వివరాలు వెల్లడించారు. పట్టణ సీఐ పి.దేవేందర్ పర్యవేక్షణలో పట్టణ ఎస్సై వి.విజయ్‌కుమార్ సిబ్బందితో ఉదయం సాలార్‌తండా సమీపంలో తనిఖీలు నిర్వహించారు. కురవి నుంచి ద్విచక్రవానంపై నుంచి వస్తున్న వ్యక్తి పోలీసులను చూసి వాహనాన్ని పక్కకు పడవేసి పారిపోతున్న క్రమంలో పోలీసులు వెంబండించి పట్టుకొన్నారు. అతడు కురవి మండలం నారాయణపురం గ్రామ పరిధిలోని ధరావత్‌తండాకు చెందిన ధరావత్ భావ్‌సింగ్‌గా గుర్తించారు. మహబూబాబాద్‌లోని నెహ్రూసెంటర్, కురవి ఆలయం ప్రాంతాల్లో తాళాలు వేసిన పది ద్విచక్రవాహనాలను అపహరించినట్లు తెలుసుకున్నారు. అపహరించిన వాటిలో 6 వాహనాలను తక్కువ ధరకు విక్రయించగా నాలుగు ఉన్నాయి. వాహనాలు కొనుగోలు చేసిన ఆరుగురిపై కేసు నమోదు చేసి వారిని కూడా అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులను పట్టుకున్న పట్టణ సీఐ దేవేందర్‌ను, ఎస్సై విజయ్‌కుమార్, సిబ్బందిని అభినందించి రివార్డులు అందజేశారు.

యువకుడి ఆత్మహత్య



వెంకటమల్లు (పాతచిత్రం)

నెల్లికుదురు, న్యూస్‌టుడే: పనులకు వెళ్లలేని దీన స్థితిలో ఉన్నానని.. మనస్తాపం చెందిన యువకుడు చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న దుర్ఘటన మండలంలోని నైనాలలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై సీహెచ్.రమేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఏర్పుల వెంకటమల్లు(38) గ్రానైట్ రాళ్ల తరలించే లారీ డ్రైవరుగా పని చేస్తున్నారు. నాలుగు నెలల కిందట చేతులపై బండరాళ్లు పడడంతో వైద్యులు చేతిని తొలగించారు. దీంతో పనులకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నారు. పనులకు వెళ్లలేక జీవనం ఇబ్బందిగా మారింది. మనస్థాపం చెందిన వెంకటమల్లు ఓ చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సరిత, కుమార్తె శ్రావ్య, కుమారుడు చింటు ఉన్నారు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

పిల్లలకు వాహనిలిస్తే తల్లిదండ్రులపై కేసులు

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: చిన్నపిల్లలు వాహనాలు నడపడం, వారికి వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయనున్నట్లు ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మైనర్, రాష్, ట్రిపుల్ రైడింగ్, మద్యం తాగి వాహనాలు నడపడం వంటి వాటిపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి 128 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. తల్లిదండ్రులు చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని ఎస్పీ కోరారు

ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలి

డోర్నకల్, న్యూస్‌టుడే: నిదానపురంలో దళితులపై దాడికి పాల్పడిన వ్యక్తులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి ఇరుగు రవి కోరారు. సంఘటనకు వ్యతిరేకంగా డోర్నకల్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ శ్రేణులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. రవి మాట్లాడుతూ నిందితులను శిక్షించకపోతే ఆందోళన ఉద్ధృతం చేస్తామన్నారు. డోర్నకల్ బాధ్యుడు వెంకటేశ్వర్లు, వెంకటేశ్, లక్ష్మణ్, వినయ్. రమేష్, అజయ్ ఉన్నారు

ఎన్నికల హామీలను అమలు చేయాలి

కురవి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. కురవి మండలం బలపాల సీపీఎం గ్రామ శాఖ మహాసభ గురువారం జరిగింది. ప్రజావ్యతిరేక విధానాలపై ఈనెల 15 నుంచి నవంబరు 15 వరకు పోరాటాలు చేయాలన్నారు. మహాసభలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాజు, మండల కార్యదర్శి కోటయ్య, నాయకులున్నారు.

వెంకటరత్నం మరణం తీరనిలోటు



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి విజయసారథి

గార్ల, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేసిన కట్టెబోయిన వెంకటరత్నం మరణం పార్టీకి తీరని లోటని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి అన్నారు. మద్దివంచలో గురువారం నిర్వహించిన వెంకటరత్నం సంస్మరణసభలో ఆయన మాట్లాడారు. సీపీఐ నాయకులు వెంకటరత్నం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్రసమితి సభ్యులు కె.శ్రీనివాస్, ఖమ్మం మాజీ డీసీసీబీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, మండల కార్యదర్శి జంపాల వెంకన్న తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు జిల్లా విద్యార్థులు

మానుకోట, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువులో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఐదో రాష్ట్రస్థాయి యోగా పోటీలకు జిల్లానుంచి 15 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరికి శిక్షకురాలిగా జిల్లా కేంద్ర జడ్పీబాలికోన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు టి.పద్మావతి, సాంకేతిక నిర్ణేతగా వ్యాయామ ఉపాధ్యాయురాలు తూనం పుష్పలీల వ్యవహరిస్తున్నారని జిల్లా యోగా అసోసియేషన్ కార్యదర్శి జి.నరేశ్ తెలిపారు. వీరంతా గురువారం మహబూబాబాద్ నుంచి వెళ్లారు.

దొడ్డి కొమురయ్య పేరుతో చలనచిత్రం

సంక్షిప్తంగా

గార్ల, న్యూస్‌టుడే: తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య పోరాట చరిత్రను సినిమాగా నిర్మిస్తున్నట్లు దర్శకుడు సేనాపతి తెలిపారు. గార్లలో గురువారం విశ్వ సమాజ వ్యవస్థాపకుడు విశ్వ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఆయన జీవిత చరిత్రను తెరపైకి తెచ్చేందుకు సహకరించాల్సిందిగా ఆయన కోరారు. పరిచయసభలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సాహిత్యవేత్తలు తదితరులున్నారు.

భూమిపూజ

ఇనుగుర్తి: అయ్యగారిపల్లిలో బతుకమ్మ విగ్రహ ఏర్పాటుకు కెక్కర్లకుంట సమీపంలో గురువారం భూమి పూజ నిర్వహించారు. మాజీ సర్పంచి శోభన్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి భవిష్యత్తు తరాల వారికి తెలియజేయాలనే లక్ష్యంతో మామిడి వంశ కుటుంబ సభ్యుల సహకారంతో విగ్రహం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

గడ్డివాము దహనం

గూడూరు: గొల్లగూడెంలో పేరాల కొమురయ్యకు చెందిన మూడు ఎకరాల గడ్డి వాముకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించడంతో పూర్తిగా కాలిపోయింది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారాన్ని అందించారు. సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. సుమారు రూ.30 వేల నష్టం వాటిల్లిందని కొమురయ్య కుటుంబ సభ్యులు తెలిపారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు

కురవి: గ్రామాలు, తండాల్లో మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సమస్య రాకుండా చూడాలని మిషన్ భగీరథ సీఈ లలిత అన్నారు. కురవి మండలంలోని అన్ని పంచాయతీలకు చెందిన మిషన్ భగీరథ సహాయకులకు నాలుగు రోజులుగా ఇచ్చిన శిక్షణ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా వారికి శిక్షణ పత్రాలను ఆమె అందజేసి మాట్లాడారు. కృష్ణారెడ్డి, డీఈలు అనూష, స్వామిదాస్, హన్మంతు, ఏఈ ప్రీతి ఉన్నారు.

జమలాపురం దర్గాలో గంధోత్సవం



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

కేసముద్రం: కేసముద్రం మండలం జమలాపురంలోని హజ్రత్‌ఖాజా హసన్ బాబా దర్గాలో బుధవారం రాత్రి అమావాస్యను పురస్కరించుకొని గంధోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నిజాముద్దీన్ చిస్తీ, ఖుతుబుద్దీన్ చిస్తీ, వజీర్ చిస్తీ, యాకూబ్ చిస్తీ, నవాబ్‌చిస్తీ, నసీర్ చిస్తీ, పర్వర్ చిస్తీ, ఫయాజ్, గౌస్‌చిస్తీ, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ పరామర్శ

ఇనుగుర్తి, న్యూస్‌టుడే: మండలకేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గుజ్జునూరి బాబురావు సతీమణి రామతార ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్ గురువారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ నాయకులు బైరు అశోక్‌గౌడ్, గంజి రాజేందర్‌రెడ్డి, హెచ్చు వెంకటేశ్వర్లు, మేకల వీరన్న తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి యోగా పోటీలకు విద్యార్థులు

మరిపెడ, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి యోగా సబ్ జూనియర్ విభాగం పోటీలలో పాల్గొనేందుకు మరిపెడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఆగస్టు 25న మహబూబాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో 10 నుంచి 14 సంవత్సరాల విభాగంలో 7వ తరగతి విద్యార్థులు లోకేష్, అఫ్రిద్ ద్వితీయ, తృతీయ స్థానం గెలుచుకొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అనంతరావు తెలిపారు.

పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా నూతన కార్యవర్గం



సంకా బద్రినారాయణ, అధ్యక్షుడు



మిర్యాల సతీష్‌రెడ్డి, కార్యదర్శి

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడిగా సంకా బద్రినారాయణ మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా స్థాయి సర్వసభ్య సమావేశంలో మహబూబాబాద్ జిల్లా నూతన కమిటీని నియమించినట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షులుగా సంకా బద్రినారాయణ, కార్యదర్శిగా మిర్యాల సతీష్‌రెడ్డితో పాటు 18 మండలాలకు చెందిన 45 మందిని జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బద్రినారాయణ మాట్లాడుతూ.. జిల్లా అధ్యక్షునిగా మరోసారి అవకాశం కల్పిస్తూ సహకరించిన సంఘం సభ్యులకు, జిల్లా, రాష్ట్ర బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

దంతాలపల్లి, న్యూస్‌టుడే: దంతాలపల్లి మండలానికి చెందిన పలువురికి పీఆర్టీయూ టీఎస్ జిల్లా కార్యవర్గంలో చోటు లభించింది. జిల్లా ఉపాధ్యక్షుడిగా పి యాకమల్లయ్య, జిల్లా మహిళా కార్యదర్శిగా ఎ. శ్రీదేవి, జిల్లా కార్యదర్శులుగా కె.శంకరయ్య, ఎం.శ్రీనివాస్ ఎన్నికైనట్లు తెలిపారు. ఎన్నికైన వారికి మండల బాధ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు.

మెగా జాబ్‌మేళాపై ప్రచారం

బయ్యారం, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాపై బయ్యారం ఏజన్సీ ప్రాంతంలో పోలీసులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. పట్టణంలో ఈనెల 8న, నిర్వహించే జాబ్‌మేళాకు యువత హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామాల్లో మైక్ ప్రచారం కొనసాగిస్తున్నారు. జాబ్‌మేళాకు హాజరై యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలని సీఐ రవికుమార్ తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

మహబూబాబాద్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.హైమావతి వైద్యాధికారులను కోరారు. గురువారం హైమావతి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించి వివిధ విభాగాలను తనిఖీ చేశారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో విధులు నిర్వహిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు హెచ్‌ఐవీ స్క్రీనింగ్ చేసి పాజిటివ్ వస్తే ఐసీటీసీ సెంటర్‌కు పంపించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట్, డీఎంహెచ్‌వో మురళీధర్, ఆర్‌ఎంవో బి.జగదీశ్వర్ తదితరులున్నారు.